ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 నంద్యాల
జిల్లా వార్తలు
గురువారం 6 జూన్ 2024




బతికిపోయాం..



తాజా రాజకీయ పరిణామాలతో ప్రజలే కాదు. చెట్లు కూడా సేదతీరాయి. వైఎస్ జగన్ సీఎంగా పర్యటించినప్పుడు ఇటీవల రహదారుల వెంట ఉన్న చెట్లు నరికి వేశారు. దీనిపై పాణ్యంకు చెందిన చిత్రకారుడు ఏకే శ్రీనివాసులు బుధవారం వ్యంగ్య కార్టూన్ వేశారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన నాయకులు చెట్లు నరికి వేయడం మీద వైసీపీ ఓటమితో వృక్షాలు ఆనందించినట్లు ఈ చిత్రాన్ని వేశారు. - నంద్యాల కల్చరల్

విరిగిన ఫ్యాన్ రెక్కలు!

- గత ఎన్నికల్లో వైసీపీ క్లీన్ స్వీప్
- ఈ సారి తిరగబడిన ఫలితాలు
- కనీసం కనికరించని ఓటర్లు



నంద్యాలలో టీడీపీ జెండా ఎగురవేసింది. ఏళ్లుగా ఇక్కడ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడంలో విఫలమవుతున్న టీడీపీ ఈసారి మాత్రం సత్తా చాటింది. గత ఎన్నికల్లో వైసీపీ సాధించిన మెజారిటీని తట్టుకుని ఈసారి గెలవడం సాధ్యమా అనే అనుమానాలను పటాపంచలు చేస్తూ టీడీపీ జిల్లాను క్లీన్‌స్వీప్ చేసింది. దీనికి టీడీపీ మేనిఫెస్టోతో పాటు నియోజకవర్గ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో బాగా కష్టపడటం కూడా కలిసి వచ్చింది. దీంతో ఏకంగా క్లీన్‌స్వీప్ చేసి రాజకీయ విశ్లేషకులను ఔరా అనిపించింది. ఈ సారి ఫలితాలు చూసి టీడీపీ ఫుల్ ఖుషీగా ఉంటే.. వైసీపీ నాయకులకు మాత్రం ఈ ఫలితాలు మింగుడు పడటం లేదు. అసలు అన్నేసి పథకాలు అందించినా, పోలింగ్‌కు రెండ్రోజుల ముందు డబ్బులు వెదజల్లినా తమను ప్రజలు ఎందుకు తిరస్కరించారో అర్థంగాక తలలు పట్టుకున్నారు.

నంద్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):

● గత ఫలితాలతో సంబంధం లేకుండా..

నంద్యాల పార్లమెంటు పరిధిలోని వైసీపీకి మంచి పట్టుంది. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 2014లో నంద్యాల పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో ఆరింటిలో వైసీపీ గెలుపొందటమే కాకుండా, నంద్యాల పార్లమెంటును కూడా వైసీపీనే కైవసం చేసుకుంది. ఇక 2019లో ఫ్యాను గాలి బలంగా వీచడంతో ఏడు స్థానాలతో పాటు పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకోవటమే కాకుండా, భారీ మెజారిటీని నమోదు చేసింది. గత ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గం అత్యధిక మెజారిటీని సాధించగా, అత్యల్ప మెజారిటీని సాధించిన బనగానపల్లె నియోజకవర్గం కూడా 13 వేలకు పైగా ఓట్ల తేడా కనబరిచింది. ఈ లెక్కన నంద్యాల పార్లమెంటు పరిధిలోని ప్రజలు వైసీపీకి ఏకపక్షంగా ఓట్లేశారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులకు ఆ స్థాయి మెజారిటీని దాటుకుని గెలవగలమా? అన్న భయం ఏదో ఓ మూలన ఉండింది. అయితే అందుకు తగ్గ ప్రణాళికను టీడీపీ నాయకులు క్షేత్రస్థాయిలో అమలు చేశారు. వైసీపీ నుంచి భారీగా చేరికలు ఉండేలా చూసుకోవడంతోపాటు, వైసీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడంతో సఫలమయ్యారు. దీనికి తోడు వైసీపీ ప్రభుత్వం ఆయా పథకాలు అందిస్తున్నా, వాటివల్ల జరిగే మేలు కన్నా, జరుగుతున్న నష్టం ఎక్కువ అనే భావనను కూడా వివరించగలిగారు. దీంతో ప్రజలు వైసీపీని గెలిపించి మరోసారి తప్పు చేయకూడదన్న భావనలోనికి వచ్చారు. దీంతో ఏకపక్షంగా ఓట్లు వేసి అన్ని సీట్లను టీడీపీ కట్టబెట్టారు.

● మట్టి కరిపించారు..

పాణ్యం 43 వేలు, నందికొట్కూరు 40 వేలు, శ్రీశైలం 38 వేలు, ఆళ్లగడ్డ 35 వేలు, డోన్ 35 వేలు నంద్యాల 32 వేలు.. ఇలా గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు భారీ మెజారిటీ సాధించారు. ఈ స్థాయి మెజారిటీని తగ్గించి టీడీపీ అభ్యర్థులు గెలిచేది లేదని, ఈ సారి కూడా తమదే గెలుపు అనే ధీమాతో వైసీపీ నాయకులు ఉన్నారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు వైసీపీ మెజారిటీని సులభంగా తగ్గించేసి గెలుపును సొంతం చేసుకున్నారు. పాణ్యంలో ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గౌరు చరిత ఓడించటమే కాకుండా 40 వేలకు పై చిలుకు మెజారిటీని సాధించారు. ఆ తర్వాత అత్యధిక మెజారిటీని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి 25 వేలకు పైగా మెజారిటీ సాధించారు. అలాగే మిగిలిన నియోజకవర్గాల్లోనూ గత ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించిన అభ్యర్థులను ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు చిత్తుచిత్తుగా ఓడించటం గమనార్హం.

● ప్రలోభాలకు లొంగని ఓటర్లు..



పోలింగ్ రెండ్రోజులు ముందు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఆయా రాజకీయ పార్టీలు చేయని ప్రయత్నాలు లేవు. జిల్లాలో అయితే వైసీపీ డబ్బును, మందును విచ్చలవిడిగా పంపిణీ చేసింది. అన్ని నియోజకవర్గాల్లో ఓటుకు రెండు వేల చొప్పున పంచింది. డబ్బు పంపిణీ విషయంలో టీడీపీ వైసీపీతో ఏమాత్రం పోటీ పడలేకపోయింది. అప్పటి వరకు టీడీపీ నాయకులదే గెలుపనుకున్నది కాస్త డబ్బు పంపిణీ వల్ల వైసీపీ వైపు మళ్లుతుందేమోనన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే ప్రజలు మాత్రం డబ్బులు, మద్యం వంటివి వైసీపీ నాయకులు ఇస్తే కాదనకుండా తీసుకుని ఓటును మాత్రం టీడీపీకే ఓటు వేశారు.

2014 సం.	ఆళ్లగడ్డ	బనగానపల్లె	డోన్	నందికొట్కూరు	నంద్యాల	శ్రీశైలం
మొత్తం ఓట్లు	1,89,401	2,56,776	1,97,541	1,89,233	2,81,799	1,87,066
పోలైన ఓట్లు	1,54,118	1,66,652	1,29,691	1,66,301	2,12,004	1,59,907
మెజారిటీ	17,842 (వైసీపీ)	17,341 (టీడీపీ)	11,152 (వైసీపీ)	21,862 (వైసీపీ)	3,604 (వైసీపీ)	4,861 (వైసీపీ)
2019 సం.	**ఆళ్లగడ్డ**	**బనగానపల్లె**	**డోన్**	**నందికొట్కూరు**	**నంద్యాల**	**శ్రీశైలం**
మొత్తం ఓట్లు	2,21,164	2,33,754	2,20,035	1,97,720	2,57,029	1,85,218
పోలైన ఓట్లు	1,87,775	1,95,097	1,74,597	1,72,720	1,97,517	1,54,007
మెజారిటీ	35,452 (వైసీపీ)	13,547 (వైసీపీ)	35,395 (వైసీపీ)	40,259 (వైసీపీ)	32,427 (వైసీపీ)	38,427 (వైసీపీ)
2024 సం.	**ఆళ్లగడ్డ**	**బనగానపల్లె**	**డోన్**	**నందికొట్కూరు**	**నంద్యాల**	**శ్రీశైలం**
మొత్తం ఓట్లు	2,32,676	2,41,179	227351	2,18,047	2,73,935	1,96,116
పోలైన ఓట్లు	1,98,052	2,05,740	1,90,120	1,86,853	2,08,578	1,64,580
మెజారిటీ	12,037 (టీడీపీ)	25,566 (టీడీపీ)	6,049 (టీడీపీ)	9,648 (టీడీపీ)	12,333 (టీడీపీ)	6,385 (టీడీపీ)

● డబ్బుతో ప్రజాభిమానాన్ని కొనలేరు..

ఎన్నికలకు ముందు వైసీపీ నిర్వహించిన సభలకు డబులిచ్చి, మందుకు పోయించి భారీగా జనాన్ని తరలించారు. సభలకు పెద్ద సంఖ్యలో జనం తరలిరావడం, సభలు విజయవంతం అవడంతో.. ఎన్నికల్లో కూడా ఇదే ప్రణాళికను పాటిస్తే విజయం తమదేనని భావించారు. మరోవైపు టీడీపీ సభలకు పెద్దగా స్పందనలేదని కూడా వైసీపీ నాయకులు ప్రచారం చేశారు. అధికార పార్టీ పిలిచినప్పుడు సభలకు, సమావేశాలకు రాకపోతే తమ మీద ఎక్కడ కక్ష సాధిస్తారోనన్న భయంతోనే ప్రజలు వచ్చారన్న విషయాన్ని వైసీపీ నాయకులు అసలు అర్థం చేసుకోలేకపోయారు. డబ్బులు తీసుకుని సభలకు, సమావేశాలకు తరలివచ్చిన వారంతా ఓట్లు వేయరన్న విషయం ప్రస్తుత ఫలితాలను చూస్తే అర్థమైపోయింది.



ఎందుకిలా ?

- వైసీపీ శ్రేణుల్లో అంతర్మథనం
- పట్టుదలతో విజయాన్ని సొంతం చేసుకున్న బుడ్డా
- రెండు దశాబ్దాల తర్వాత శ్రీశైలం ఎగిరిన టీడీపీ జెండా



ఆత్మకూరు, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వైసీపీకి గట్టి షాక్ ఇచ్చాయి. ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు 164స్థానాల్లో విజయ దుందుభి మోగించారు. ఈ క్రమంలో శ్రీశైల నియోజకవర్గంలో కూడా వైసీపీకి ఓటమి తప్పలేదు. వైసీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి ఈ ఎన్నికల్లో గెలిచేందుకు అనేక విధాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ చివరకు నిరాశే మిగిలింది. దీంతో ఎందుకు ఇలా జరిగిందని వైసీపీ శ్రేణుల్లో అంతర్మథనం నెలకొంది. వాస్తవానికి 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి 38,669 మెజార్టీ లభించింది. ఇటువంటి పరిస్థితుల్లో వైసీపీని ఢీకొట్టగలమా..? అని అప్పట్లో టీడీపీ శ్రేణుల్లో ఆందోళన కలిగింది. అయితే టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన బుడ్డా రాజశేఖరరెడ్డి ఏడాదిన్నర ముందు నుంచే ఎంతో ప్రణాళిక, పట్టుదలతో ముందుకెళ్లడంతో అనుకున్నట్లుగా విజయాన్ని సొంతం చేసుకున్నారు. అంతేకాదు, 1999 ఎన్నికల్లో బుడ్డా సీతారామిరెడ్డి టీడీపీ తరఫున పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్, 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించాయి. సుమారు 20 ఏళ్లుగా ఇక్కడ టీడీపీ గెలవలేదు. దీంతో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా ముందు నుంచే పనిచేయడంతోనే టీడీపీ జెండా ఎగురవేసిందని చెప్పవచ్చు. వీరికి జనసేన, బీజేపీలు తోడవ్వడంతో బుడ్డా విజయం సుగమమైంది.

వైసీపీ అంచనాలన్నీ తారుమారు :

ఈ ఎన్నికల్లో తామే గెలుస్తామని వైసీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేశాయి. పైగా వైసీపీ అభ్యర్థి శిల్పా గెలుస్తారని లక్షల్లో బెట్టింగ్‌లు వేసేందుకు కూడా ఉత్సాహం చూపినట్లు సమాచారం. అయితే ఎన్నికల ఫలితాలు మాత్రం వారి అంచనాలకు భిన్నంగా రావడంతో వారందరూ కంగుతిన్నారు. సున్నిపెంట, ఆత్మకూరు టౌన్, బండి ఆత్మకూరు మండలంలో వచ్చే మెజార్టీతో తాము గెలుస్తామని వైసీపీ నాయకులు భావించినప్పటికీ అనుకున్న స్థాయిలో మెజార్టీ లభించలేదు. ప్రత్యేకించి శ్రీశైలంలో టీడీపీకి 1227 ఓట్ల మెజార్టీ రాగా సున్నిపెంటలో 423 ఓట్లు, ఆత్మకూరు పట్టణంలో 3914 ఓట్లు వైసీపీకి మెజార్టీ లభించింది. అదే క్రమంలో ఆత్మకూరు రూరల్ మండలంలో 226 ఓట్లు, వెలుగోడు మండలంలో 5927 ఓట్లు, బండిఆత్మకూరు మండలంలో 876 ఓట్లు, మహానంది మండలంలో 2294 ఓట్లు టీడీపీకి మెజార్టీ దక్కాయి. దీనికి తోడు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 444 వచ్చాయి. దీంతో ఆ పార్టీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి 6,385 ఓట్లతో విజయం సాధించారు. కాగా టీడీపీలో కార్యకర్తలు కసితో పనిచేస్తే.. వైసీపీలో మాత్రం చాలా మంది శిల్పా చక్రపాణి రెడ్డి వద్ద డబ్బు ప్యాకేజీలు తీసుకుని అందుకు తగ్గట్లుగా పనిచేయలేదని ప్రచారం జరుగుతోంది. ఓటుకు రూ.2వేల చొప్పున వైసీపీ పంపిణీ చేసినప్పటికీ వైసీపీ పాలనపై ఉన్న వ్యతిరేకతతోనే ప్రజలు టీడీపీకి పట్టం కట్టినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా.. రెండు దశాబ్దాల తర్వాత శ్రీశైలంలో టీడీపీ జెండా ఎగరడం స్థానికంగా చర్చనీయాంశమైంది.



51 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు..

నంద్యాల (నూనెపల్లె), జూన్ 5: నంద్యాలలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో 1972-73 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగింది. 51 ఏళ్ల తరువాత దాదాపు 29 మంది పూర్వ విద్యార్థులు ఒకే వేదికలో కలుసుకోవడంతో ఎస్పీజీ పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి పూర్వ విద్యార్థులు వచ్చారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివద్ధి పూర్వ విద్యార్థుల ప్రత్యేక బృందం నుంచి కమిటీని ఏర్పాటు చేసి త్వరలోనే సహాయ సహకారాలు అందిస్తామని బ్రహ్మానంద రెడ్డి మోహన్ చాణక్యరాజులు తెలిపారు. అదే విధంగా తమ బ్యాచ్‌లో పేదరికంలో ఉన్న కుటుంబాలకు కూడా నెల నెలా కొంత మేర నిధులను మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, శివ శంకరరాజు, మనోరంజని, లక్ష్మి నరిసింహ, జ్యోతి రాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన ఎస్పీజీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

రూ.కోట్లు.. అధికారం పాయే..

- రూ.10 కోట్ల వరకు బెట్టింగులు పెట్టిన వైసీపీ నాయకులు
- డోన్ నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

డోన్, జూన్ 5 : 2024 డోన్ నియోజకవర్గంలో వైసీపీ నాయకులకు విచిత్రమైన పరిస్థితి ఎదురైంది. బెట్టింగుల రూపంలో ఇటు రూ.కోట్లు పోగొట్టుకుని, అధికారం కోల్పోవడంతో వైసీపీ నాయకులకు డబుల్ షాక్ తగిలింది. ఎన్నికల ఫలితాలకు వారం రోజుల ముందు నుంచే డోన్ నియోజకవర్గంలో బెట్టింగులు పెద్ద ఎత్తున నడిచాయి. రాష్ట్రంలో మా పార్టీ ప్రభుత్వంలో వస్తుంది..? డోన్‌లో ఏ పార్టీ ఎమ్మెల్యేగా గెలుస్తుంది..? అనే వాటిపై టీడీపీ, వైసీపీ నాయకులు రూ.కోట్లలో బెట్టింగులు కాశారు. టీడీపీ ప్రభుత్వం వస్తుందని రూ.లక్షకు రూ.1.50 లక్షలు ఇస్తామని టీడీపీ నాయకులు ఆఫర్ చేశారు. ఇందుకు పలువురు వైసీపీ నాయకులు ముందుకు రావడంతో రూ.కోట్లలో బెట్టింగులు నడిచాయి. అదే విదంగా డోన్ ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థే గెలుస్తాడని రూ.లక్షకు రూ.2 లక్షలు ఇస్తామని వైసీపీ నాయకులు ఆఫర్ చేశారు. అందుకు పలువురు టీడీపీ నాయకులు ఒకే చెప్పడంతో నియోజవర్గంలో రూ.3 కోట్లకు పైనే వాటి మీద బెట్టింగులు నడిచినట్లు తెలిసింది. అదే విధంగా డోన్ రూరల్‌లో వైసీపీకి మెజారిటీ వస్తుందని ఆ పార్టీ నాయకులు రూ.2 కోట్లకు పైగానే బెట్టింగులు పెట్టారు. ప్యాపిలి మండలంలోనూ రూ.2 కోట్ల వరకు బెట్టింగులు నడిచాయి. ఆరా మస్తాన్ సర్వే వైసీపీకి అనుకూలంగా ఇవ్వడంతో.. ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున బెట్టింగులు పెట్టారు. ఇలా డోన్ నియోజకవర్గంలో రూ.10 కోట్ల వరకు వైసీపీ నాయకులు బెట్టింగులు పెట్టి పోగొట్టుకున్నట్లు రాజకీయ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది.



అవుకు మండలంలో టీడీపీ పాగా

- ఖంగుతిన్న చల్లా, కాటసాని కుటుంబాలు
- 40 ఏళ్ల హవాకు చెక్ పెట్టిన బీసీ
- అవుకు మండలంలో టీడీపీకి 2032 ఓట్ల మెజార్టీ

అవుకు, జూన్ 5: అవుకు మండలంలో ఈ ఎన్నికల్లో టీడీపీ పాగా వేసింది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 50,452 మంది జనాభా ఉండగా 42,679 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో 34,809 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81.74 శాతం ఓటింగ్ జరిగింది. మండలంలో 15 గ్రామాల్లో బీసీ జనార్దన్‌రెడ్డికి 6,111 ఓట్ల మెజార్టీ రాగా ప్రత్యర్థి కాటసాని రామిరెడ్డికి 11 గ్రామాల్లో 4,079 ఓట్ల మెజార్టీ వచ్చింది. దీంతో అవుకు మండలంలో బీసీ 2032 ఓట్ల మెజార్టీని అందుకున్నారు. ఈ పరిణామంతో కాటసాని, చల్లా కుటుంబాలు ఖంగుతిన్నాయి. గత 2019 ఎన్నికల్లో అవుకు మండలంలో కాటసాని రామిరెడ్డి 6,800 ఓట్లు మెజార్టీ అందుకున్నారు. గతంలో అవుకు మండలంలో పలు గ్రామాల్లోని ప్రజలు కాటసాని, చల్లా కుటుంబాలు కనుసైగతో శాసిస్తూ 9 వేలకు పైగా ఓట్లను తమ గుప్పిట్లో ఉంచుకుని 40 ఏళ్లకు పైగా హవా కొనసాగించాయి. కనీసం ఇతర పార్టీలు ఆ గ్రామాల్లో ప్రచారం చేసుకోవడం గాని, పోలింగ్ రోజు ఏజెంట్లను కూర్చోబెట్టుకునే పరిస్థితి ఉండేది కాదు. ఈసారి ఎన్నికల్లో బీసీ జనార్దన్‌రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదిపారు. కాటసాని కుటుంబం నుంచి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, వంగల పరమేశ్వర్‌రెడ్డి, చల్లా కుటుంబం నుంచి చల్లా విజయభాస్కర్‌రెడ్డి టీడీపీలో చేరే విధంగా చక్రం తిప్పారు. ఈసారి కాటసాని, చల్లాకు పట్టున్న 11 గ్రామాల్లో టీడీపీ, వైసీపీ ఢీ అంటే ఢీ అని పోటీ పడ్డాయి. దశాబ్దాలుగా ఓటు హక్కుకు నోచుకుని ఈ గ్రామాల్లో ఓటర్లలో బీసీ చైతన్యం రగిలించారు. ఈ గ్రామాల్లో మొదటిసారి తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం రావడంతో గంపగుత్తగా పడే 9వేల పై చిలుకు ఓట్లలో ఈసారి 5 వేల ఓట్ల వరకు గండి పడింది. ఈ సారి ఆ గ్రామాల్లో కాటసాని 4079 ఓట్ల మెజార్టీ మాత్రమే వచ్చింది. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఐవీ పక్కీరారెడ్డి టీడీపీ గెలుపులో కీలకంగా వ్యవహరించారు. చివరలో పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథిరెడ్డి టీడీపీకి మద్దతు ప్రకటించడంతో బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపు నల్లేరు మీద నడకగా సాగింది. రామాపురంలోని ఐవీ పక్కీరారెడ్డి ఇంటి వద్దకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి సంబరాలు చేసుకున్నారు. అలాగే చల్లా విజయభాస్కర్‌రెడ్డి, బత్తిన మద్దిలేటిగౌడ్, మనోహర్‌రెడ్డిలు బీసీ జనార్దన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అవుకు పట్టణంలో టీడీపీ 1751 ఓట్ల మెజార్టీ వచ్చింది. చెన్నంపల్లెలో టీడీపీకి 1056 ఓట్లు, రామాపురంలో 900 ఓట్లు, సంగపట్నంలో 822, కునుకుంట్లలో 456 ఓట్లు, సింగనపల్లెలో 322 ఓట్లు, చెర్లోపల్లెలో 273, శివవరంలో 227 ఓట్లు, గోకులదిన్నెలో 92 ఓట్లు, వేములపాడులో 78 ఓట్లు, ఇస్రానాయక్ తండాలో 66 ఓట్లు, మంగంపేట తండాలో 32, చనుగొండ్ల 17 ఓట్లు, సుంకేసుల 13 ఓట్లు, కాశీపురంలో 6 ఓట్ల మెజార్టీ వచ్చింది. అలాగే కాటసాని గ్రామాల్లో వైసీపీకి గుండ్లశింగవరంలో 701, నిచ్చెనమెట్లలో 431, లింగంబోడులో 303, రామవరంలో 295 ఓట్లు, మెట్టుపల్లెలో 207 ఓట్లు, మంగంపేటలో 102 ఓట్లు, అన్నవరంలో 36 ఓట్లు, కోనాపురంలో 31 ఓట్లు వచ్చాయి. చల్లా గ్రామాలైన ఉప్పలపాడులో 1037, జూనుంతలలో 604, కొండమనాయినిపల్లెలో వైసీపీకి 332 ఓట్ల మెజార్టీ వచ్చింది.



రామాపురంలో ఐవీ పక్కీరారెడ్డిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



బీసీ జనార్దనరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చల్లా విజయభాస్కరరెడ్డి, మద్దిలేటి గౌడ్


ప్రజలకు అభివాదం తెలుపుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి


గౌరు దంపతులకు పూలమాలతో సన్మానం


కేఈ శ్యాంబాబును సత్కరిస్తున్న తిక్కారెడ్డి తదితరులు


కోట్లను సత్కరించిన టీడీపీ నాయకులు

తెలుగు తమ్ముళ్ల విజయోత్సవాలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబరాలు
- కిక్కిరిసిన ఎమ్మెల్యేల నివాసాలు, టీడీపీ కార్యాలయాలు


బీసీకి పూలమాలలతో అభిమానుల సత్కారం


మంత్రాలయంలో రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

కర్నూలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా తెలుగుతమ్ముళ్లలో మునుపటి జోష్ కనిపించింది. తిరుగులేని విజయాలు సాధించిన టీడీపీ ఎమ్మెల్యేల నివాసాలు, పార్టీ కార్యాలయాలు కార్యకర్తలతో కిక్కిరిశాయి. జిల్లా వ్యాప్తంగా విజయోత్సవాలు అంబరాన్ని తాకాయి. కర్నూలు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ విజయం సాధించి పాతికేళ్ల తరువాత కొండారెడ్డి బురుజుపై పసుపు జెండాను ఎగురవేశారు. టీడీపీ శ్రేణులు, టీజీ అభిమానులు పెద్దఎత్తున బాణాసంచా పేల్చారు. టీజీ భరత్‌ను పూల మాలలతో ముంచెత్తారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డిలను టీడీపీ శ్రేణులు పూలమాలలతో ముంచెత్తారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులను తెలుగుతమ్ముళ్లు ఘనంగా సత్కరించారు. కర్నూలు నగరంలోని వారి ఇంటికి కిలోమీటరుకు పైగా కార్యకర్తలతో జాతరగా మారింది. ఎమ్మిగనూరు నుంచి రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచిన బీవీ జయనాగేశ్వరరెడ్డిని టీడీపీ శ్రేణులు, అభిమానులు ఘనంగా సన్మానించారు. పత్తికొండ నుంచి విజయం సాధించిన విజేత ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును అభిమానులు భారీగా సన్మానించారు. కర్నూలు ఎంపీగా విజయం సాధించిన బస్తిపాటి నాగరాజు, పత్తికొండ విజేత ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబులను టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. టీడీపీ ఘన విజయాన్ని పురస్కరించుకొని ఆలూరులో టీడీపీ అభ్యర్థి బి.వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఆదోని నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి బీజేపీ, జనసేన, టీడీపీ శ్రేణులతో విజయోత్సవాలు చేసుకున్నారు. ఆదోనిలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడును టీడీపీ నేతలు గజమాలతో సత్కరించారు.


టీజీ భరత్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నంద్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో గెలిచిన టీడీపీ అభ్యర్థుల ఇళ్లు, కార్యాలయాలు సందడి సందడిగా మారాయి. గెలిచిన తమ నేతను కలిసి ఫొటోలు దిగేందుకు, దండలు వేసి అభిమానాన్ని చాటేందుకు అభిమానుల పోటెత్తారు. నంద్యాలలో ఎమ్మెల్యే ఫరూక్ నివాసంలో సంబరాలు ఘనంగా జరిగాయి. బనగానపల్లెలో బీసీ జనార్దన్ రెడ్డి ఇంటి వద్ద టీడీపీ శ్రేణులు పోటెత్తాయి. శ్రీశైలం, ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, భూమా అఖిలప్రియ నివాసాలు టీడీపీ శ్రేణులతో కిక్కిరిశాయి. నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డిలను టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరితో పాటు ఆయన తండ్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.


ఫరూక్‌ను సన్మానిస్తున్న నాయకులు


ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి పుష్పగుచ్ఛం ఇస్తున్న గుడిసె కృష్ణమ్మ


అఖిలప్రియకు శుభాకాంక్షలు తెలుపుతున్న చాగలమర్రి నాయకులు


మహానందిలో బుడ్డా రాజశేఖరరెడ్డికి సత్కారం


దస్తగిరికి శుభాకాంక్షలు తెలుపుతున్న పసుపుల గ్రామస్థులు


ఎంపీ నాగరాజుకు స్వీట్లు తినిపిస్తున్న మాజీ ఎంపీ


బైరెడ్డి శబరికి శుభాకాంక్షలు తెలుపుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి


నందికొట్కూరులో మాండ్రకు పూలమాలతో స్వాగతం

రాజోలి ఆనకట్టపై పొంగి ప్రవహించిన వరద నీరు



చాగలమర్రి, జూన్ 5: మండలంలోని రాజోలి ఆనకట్టపై బుధవారం వరద నీరు పొంగి ప్రవహించింది. జిల్లాలో ఎగువన కురిసిన వరద నీరు ఆనకట్టకు చేరింది. ఆనకట్టపై పొంగి ప్రవహించినట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆనకట్ట వద్దగల గేట్లను ఎత్తి కడప జిల్లావైపుగల కుందూకు నీటిని విడుదల చేశామని చెప్పారు. కుందూలో 4 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని తెలిపారు. నెల రోజుల నుంచి నీరు లేక ఒట్టిపోయిన రాజోలి ఆనకట్ట వద్ద వరద నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. పరిసర గ్రామాల రైతులు, కూలీలు, మూగ జీవాలకు దాహం తీరినట్లైంది.

యాగంటి ఉమామహేశ్వరుడి కల్యాణం

బనగానపల్లె, జూన్ 5: మండలంలోని యాగంటి ఉమా మహేశ్వర స్వామి క్షేత్రంలో మాసశివరాత్రి సందర్భంగా స్వామివారి కలాణ్యాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహేశ్వర శర్మ, ఇతర అర్చకుల ఆధ్వర్యంలో కలాణ్యం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆగని వైసీపీ దాడులు

- టీడీపీ కార్యకర్తల ఇంటికెళ్లి మూకుమ్మడిగా దాడి చేసిన వైనం
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- అలసందగుత్తిలో హైటెన్షన్


గాయపడ్డ పూజారి నాగరాజు


చికిత్స తీసుకుంటున్న బంగారప్ప నాగరాజు

ఆదోని రూరల్, జూన్ 5 : వైసీపీ ఆగడాలను తట్టుకోలేక ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా వారిలో మచ్చుకైనా మార్పు రాలేదు. ఇప్పటికీ వైసీపీ మూకలు టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారు. ఆదోని మండలం అలసందగుత్తిలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి 66 ఓట్లు ఎక్కువ వచ్చాయి. ఇది జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు మూకుమ్మడిగా టీడీపీ కార్యకర్తల ఇంటికెళ్లి రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. కూటమి అభ్యర్థి విజయం సాధించడంతో బుధవారం తెలుగుదేశం కార్యకర్తలు పూజారి నాగరాజు, బంగారప్ప నాగరాజు, నరసప్ప గ్రామంలోని చౌడమ్మ దేవాలయానికి వెళ్లి పూజలు చేసి సంబరాలు చేసుకున్నారు. దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు నాగేంద్ర, సోమలింగ, రవి, సమర, సోమప్ప, ఈరన్న, వెంకటేశులు, తిక్కన్నతోపాటు మరికొందరు పూజారి నాగరాజు, బంగారప్ప నాగరాజు, నరసప్ప ఇండ్లకెళ్లి రాళ్లు, కట్టెలతో దాడి చేసి, మీరు కూటమి అభ్యర్థికి సపోర్ట్ చేయడంతో 66 మెజార్టీ వచ్చిందని కొట్టారు. ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి, రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు ఎర్రిస్వామి, శ్రీనివాసులు, పీరయ్య సంఘటన స్థలానికి చేరుకొని అల్లరి మూకలను చెదరకొట్టారు. గాయపడిన వారిని ఆదోని ఏరియాసుపత్రికి తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

టీడీపీకి ఓటు వేశారని ముగ్గురిపై దాడి

బనగానపల్లె రూరల్, జూన్ 5 : తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తారా మీ అంతు చూస్తామంటూ వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయి ముగ్గురు టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని నందవరం గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం గ్రామానికి చెందిన పెద్ద భాస్కరయ్య గారి భాస్కర్, రవి, గోవిందులు నందవరంలోని కమాన్ బస్టాండ్ వద్ద కూర్చొని ఉండగా వైసీపీకి చెందిన దత్తయ్య గారి ఆదిశేష, అశోక్, రామకిట్టు, శివ, దత్తయ్య గారి రామకిట్టులు గట్టిగా కేకలు వేస్తూ 'నా కొడకల్లారా మీరు తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తారా మిమ్మల్ని చంపితే ఎవరు అడ్డం వస్తారు' అంటూ కర్రలు, ఇనుపరాడ్లు, క్రికెట్ బ్యాట్‌తో విచక్షణా రహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ దాడిలో భాస్కర్, రవి, గోవిందులు తీవ్రంగా గాయాలపాలై బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై నందివర్గం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.




వైసీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన భాస్కర్, రవి, గోవిందు

వైద్యులకు శిక్షణ

కర్నూలు(హాస్పిటల్), జూన్ 5: కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యులకు మూడు రోజుల స్కీనింగ్‌పై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా నుంచి ఏడుగురు డాక్టర్ల బృందం విశాఖపట్నంలో నిర్వహించిన కేన్సర్ స్కీనింగ్‌పై రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ బృందం మెడికల్ కాలేజీలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ఈ నెల 7వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, కేన్సర్ విభాగపు హెచ్‌వోడీ ప్రకాష్, ఆర్‌బీఎస్‌కే పీవో హేమలత, వైస్ ప్రిన్సిపాల్ సాయి నవీన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్యాపిలి, జూన్ 5: మండలంలోని వెంకటాంపల్లి గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జింకల రమేష్(25) మృతి చెందాడు. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన పెద్దన్న కుమారుడు రమేష్ పని నిమిత్తం బైకుపై మండలంలోని రంగాపురం గ్రామానికి వెళ్లాడు. పని పూర్తి చేసుకొని తిరిగి ప్యాపిలికి వస్తుండగా మార్గ మధ్యలోని వెంకటాంపల్లి దగ్గరకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

విజేతలను ఊహించి గెలిచారు..!

- 'ఎవరు గెలిచినా మీదే గెలుపు'తో ఆంధ్రజ్యోతి పోటీలు
- పక్కాగా అంచనా వేసిన పాఠకులు
- లక్కీడిప్‌లో నలుగురు విజేతల ఎంపిక

కర్నూలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి పాఠకుల అంచనా నిజమైంది. రాజకీయ విశ్లేషణలను పటాపంచలు చేస్తూ పాఠకులు ఖచ్చితమైన తీర్పును అంచనావేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగిన ఎన్నికల్లో 14 అసెంబ్లీ స్థానాలకు గానూ.. 12 స్థానాల్లో టీడీపీ, రెండు స్థానాల్లో వైసీపీ విజయం సాధిస్తుందని ఫలితాలు రాకనే పాఠకులు వెల్లడించారు. 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పేరుతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో అంచనా వేయాలంటూ ఆంధ్రజ్యోతి పోటీలు నిర్వహించింది. ప్రతీవారం ఆంధ్రజ్యోతి పత్రికలో కూపన్లను ప్రచురించింది. పాఠకులు కూపన్లను భర్తీ చేసి రాష్ట్ర స్థాయిలో విజయవాడ ఆఫీసుకు, జిల్లా స్థాయిలో కర్నూలు ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయానికి పంపారు. ఈ పోటీల్లో ఆంధ్రజ్యోతి పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుస్తుందో..? ఊహించి దాదాపు 4 వేలకు పైగా పాఠకులు కూపన్లు కర్నూలు యూనిట్ కార్యాలయానికి పంపారు. బుధవారం యూనిట్ కార్యాలయంలో గెలుపునకు దగ్గరగా అంచనాలు వేసిన కూపన్లను పరిశీలించారు. మెజార్టీ పాఠకులు 14 స్థానాలకు గానూ ఎన్డీఏ కూటమి 10-12 స్థానాలు, వైసీపీ 2-4 స్థానాల్లో గెలుస్తుందని అంచనా వేశారు. కొందరైతే 14 స్థానాల్లో టీడీపీ కూటమే విజయం సాధిస్తుందని ఊహించారు. లక్కీడిప్ ద్వారా డ్రా తీసి నలుగురు విజేతలను ఎంపిక చేశారు. వారిలో ప్రథమ విజేతగా నంద్యాల జిల్లా కొత్తబురుజు గ్రామానికి చెందిన డీవీ మణికంఠేశ్వర రావు ఎంపికయ్యారు. మొదటి విజేతకు రూ.10 వేలు ప్రైజ్‌మనీ అందజేస్తారు. అదేవిధంగా ద్వితీయ, తృతీయ, నాలుగు స్థానాల్లో ఎంపికైన వారికి రూ.5 వేలు చొప్పున ప్రైజ్‌మనీ అందజేస్తారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజరు లక్ష్మన్, సర్క్యులేషన్ మేనేజరు జి.సోమశేఖర్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్ కుమార్‌నాయుడు, బ్యూరో ఇన్‌చారి గోరంట్ల కొండప్ప, సర్క్యులేషన్ టీం సభ్యులు పాల్గొన్నారు.


లక్కీడిప్ తీస్తున్న ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ లక్ష్మణ్



మొదటి విజేత : డీవీ మణికంఠేశ్వర రావు, కొత్తబురుజు గ్రామం, డోన్ మండలం నంద్యాల జిల్లా.

2,3,4 విజేతలు : పి.లక్ష్మీనరసయ్య, హరివరం గ్రామం, ఉయ్యాలవాడ మండలం, నంద్యాల జిల్లా
బి. శ్రీదేవి, లక్ష్మీపురం గ్రామం, కల్లూరు మండలం.
బి.రెహానా, కృష్ణానగర్, కర్నూలు నగరం.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఆనందోత్సాహంలో టీడీపీ శ్రేణులు

- అంబరాన్నంటిన సంబరాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఎమ్మెల్యేలను కలిసిన పార్టీ శ్రేణులు

పాణ్యంపై టీడీపీ జెండా

- గౌరు చరిత విజయంతో అంబరాన్నంటిన సంబరాలు
- ఎమ్మెల్యే నివాసంలో టీడీపీ శ్రేణుల విజయోత్సవాలు



గౌరు జనార్దన్‌రెడ్డితో సెల్ఫీలు దిగుతున్న నాయకులు, కార్యకర్తలు

కల్లూరు, జూన్ 5: తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా 40,591 ఓట్ల అత్యధిక మెజార్టీతో గెలిచిన గౌరు చరిత పాణ్యం గడ్డపై జెండా ఎగురవేశారు. సౌమ్యురాలిగా పేరున్న గౌరు చరిత సాధారణ ఎన్నికల బరిలో నిలిచి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రత్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డిపై భారీ మెజార్టీతో ఘనం విజయం కైవశం చేసుకున్నారు. అనునిత్యం ప్రజల్లో ఉంటూ కార్యకర్తలకు అండగా నిలిచి ధైర్యం చెబుతూ గౌరు దంపతులు పాణ్యం నియోజకవర్గంలో సీనియర్ ఎమ్మెల్యే బలమైన నాయకుడు కాటసానిపై గెలుపొంది విజయం సాధించడం పట్ల టీడీపీ నాయకులు, కార్యకర్తల అనందానికి అవధుల్లేకుండా పోయాయి.

గౌరు నివాసంలో అంబరాన్నంటిన సంబరాలు: అఖండ మెజారిటీతో విజయ దుందుభి మోగించిన గౌరుచరిత నివాసంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం ఉదయాన్నే ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం, కల్లూరు రూరల్, అర్బన్ ప్రాంతాల నుండి వేల సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, మహిళలు గౌరు నివాసానికి చేరుకుని తమ అభిమాన ఎమ్మెల్యే చరితమ్మకు అభినందనలు తెలిపారు. పూలదండలతో గౌరు దంపతులను ముంచెత్తారు. పుష్పగుచ్చాలు అందించి, భారీకేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. డీజే పాటలతో, డప్పు వాయిద్యాలతో సంబరాలు జరుపుకున్నారు. పాణ్యం, నందికొట్కూరు నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో అమ్మ హాస్పిటల్ ప్రాంతం సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో అన్ని మండలాల టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'నందికొట్కూరు అభివృద్ధికి కృషి'



మాట్లాడుతున్న శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, జూన్ 5: నందికొట్కూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయబోమని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారిగా నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో బుధవారం మాండ్ర నివాసంలో జయసూర్య విలేకరుల సమావేశం నిర్వహించారు. మాండ్ర మాట్లాడుతూ నందికొట్కూరు పట్టణంతో పాటు గ్రామాల్లో తాగు, సాగు నీరు అందించేందుకు కృషిచేస్తామన్నారు. టీడీపీ హయాంలో హంద్రీ నీవా, ముచ్చుమర్రి ఎత్తిపోతల ద్వారా రెండు ప్రత్యేక పంపులను ఏర్పాటుచేసి కేసీ కెనాలుకు నీరందించామన్నారు. అలాగే ఆరు ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తిచేయించామన్నారు. అలాగే క్రిష్ణా పుష్కరాల సమయంలో గ్రామాలకు రోడ్లు వేయించామన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం, పోలవరం జాతీయ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చంద్రబాబు ఎంతగానో శ్రమించారని గుర్తుచేశారు. జగన్ రాక్షస పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, దీంతో చంద్రబాబు వస్తేనే అభివృద్ధి సాధ్యమని భావించి టీడీపీకి పట్టం కట్టారని అన్నారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా తనను గెలిపించిన ప్రజలకు, నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని, ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా శాంతియుతంగా పాలన సాగిస్తామన్నారు. అలాగే నందికొట్కూరు మున్సిపాలిటీ పట్టణానికి గతంలో తాగు నీటికోసం మాండ్ర శివానందరెడ్డి కృషి వల్ల అలగనూరు రిజర్వాయర్ నుంచి రూ.120 కోట్లతో నీటిని అందించేందుకు ప్రభుత్వం నుంచి పనులు కూడా మంజూరు చేయించారని, అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోలేదని వాపోయారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, పలుచాని మహేశ్వరెడ్డి, నారపురెడ్డి, లింగస్వామిగౌడు తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ అభివృద్ధికి సహకరించాలి'

మహానంది, జూన్ 5: మహానంది ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. బుధవారం ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి స్వగ్రామం వేల్పనూరులోని ఆయన నివాసంలో ఆలయ ఈవోతో పాటు వేదపండితులు,అర్చకులు కలిశారు. ఎమ్మెల్యే దంపతులను వేదపండితులు ఆశీర్వదించారు. శాలువాతో సన్మానించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

'వైసీపీకి ఓటుతో సమాధానం చెప్పిన ప్రజలు'



మాట్లాడుతున్న జనసేన పార్టీ సమన్వయకర్త సుధాకర్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూటమి నుంచి పిఠాపురంలో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసి 70 వేల ఓట్లతో గెలపొందటం చారిత్రాత్మకమని నంద్యాల జనసేన పార్టీ సమన్వకర్తలు పిడతల సుధాకర్, రవికుమార్ అన్నారు. బుధవారం నంద్యాలలోని జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించి చారిత్రాత్మక విజయాన్ని కూటమి నమోద చేయటంపై వారు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించి ప్రజా సంక్షేమ పాలనను స్థాపించే విధంగా కృషి చేయాలనే అంశాన్ని ప్రజలు స్వీకరించి ఓటుతో సమాధానం చెప్పారని వారు అన్నారు. రాష్ట్రంలో 21 స్థానాలు 2 ఎంపీ స్థానాలను జనసేన కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. నంద్యాలలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండీ ఫరూఖ్ విజయానికి కృషి చేసిన నసేన నాయకులు కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో భారీ వర్షం

ఆత్మకూరు, జూన్ 5: ఆత్మకూరు పట్టణంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం కొంతమేర ఎండ తీవ్ర ఉన్నప్పటికీ నైరుతి రుతుపవనాల ప్రభావంతో సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం చల్ల బడింది. ఆతర్వాత రాత్రి 7.30గంటల నుంచి 8.30గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. కప్పలకుంట, అప్పారావువీధి, తిక్కయ్యస్వామిదర్గా ప్రాంతాలతో పాటు కేజీ రోడ్డుపై పలుచోట్ల వర్షపునీరు నిలిచి తీవ్ర అంతరాయంగా మారింది. ఇదిలావుంటే పదునైన వర్షం కురియడంతో అన్నదాతల్లో కూడా ఆనందం వెల్లివిరిసింది.



ఎమ్మెల్యే బుడ్డాను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు



పాణ్యంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 5: సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు ఆకర్షించాయని, అలాగే వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత కూడా కూటమికి కలిసి రావడంతో అఖండ విజయాన్ని సాధించినట్లు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. రాష్ట్రంలో కూటమి భారీ విజయంతో నంద్యాలలోని దివ్యాంగుల సంక్షేమ సంఘం, కళారాధన క్రీడా సమాఖ్య కార్యాలయంలో ఆధర్యంలో కేక్ కట్ చేశారు. నంద్యాలలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండీ ఫరూఖ్ విజయం సాధించడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రమణయ్య, లయన్స్ క్లబ్ కార్యదర్శి నాగరాజు, ప్రముఖ రంగ స్థల, సినీ, టీవీ నటుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్: నంద్యాల ఖలీల్ థియేటర్ ప్రాంతంలోని టీడీపీ కార్యాలయంలో కూరగాయల మార్కెట్ సభ్యుడు మార్కెట్ ప్రసాద్ నంద్యాల ఎమ్మెల్యే ఎన్ఎండీ ఫరూక్‌కు శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల శేషవస్త్రం, మెమెంటో ఇచ్చి శాలువా కప్పి, కేక్ తినిపించుకున్నారు. స్వీట్లు ఒకరికొకరు తినిపించుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కూటమి భారీ విజయం, శ్రీశైలం అసెంబ్లి అభ్యర్థి బుడ్డారాజశేఖరరెడ్డి విజయం సాధించడంతో టీడీపీ శ్రేణుల ఆనందంలో మునిగితేలుతున్నారు. కేక్ కట్ చేశారు. కరివేన గ్రామంలో టీడీపీ నాయకులు శరత్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు గాయత్రిమాత ఆలయంలో, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ఆవరణలో 200 టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శరత్‌బాబు మాట్లాడుతూ..జగన్ ప్రజా వ్యతిరేక పాలన అంతమైందని, టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ పాలనతో ప్రజలందరికీ మేలు జరుగుతుందని అన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాకుండా ప్రతి కుటుంబానికి సంక్షేమ పలాలు అందిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: శ్రీశైలం ఎమ్మెల్యేగా గెలుపొందిన బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని బండిఆత్మకూరు మండల టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు. బుధవారం బండిఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేల్పనూరుకు తరలి వెళ్లి బుడ్డాను గజమాలలతో, శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. బొకేలు అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వీరనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణనాయక్, ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, మాధవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శేఖర్, పాల సుబ్బారెడ్డి, జాకీర్, చెన్నారెడ్డి, మనోహర్, శంకర్ పాల్గొన్నారు.

వెలుగోడు: టీడీపీ శ్రీశైల నియోజక వర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన బుడ్డాను కలిసేందుకు నియోజకవర్గంలోని నలు మూలల నుంచి టీడీపీ నాయకులు కార్యకర్తలు బుడ్డా స్వగ్రామమైన వేల్పనూరుకు బుధవారం భారీగా తరలి వచ్చారు. తమ అభిమాన నాయకుడు విజయం సాధించడం పట్ల బుడ్డాను కలిసి శాలువాలు కప్పి బొకేలు ఇచ్చి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. పలు ప్రాంతాల నుంచి భారీగా అభిమానులు తరలి రావడంతో వేల్పనూరు జన సంద్రంగా మారింది. మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్ స్తంభించి రాకపోకలకు కాస్త ఇబ్బంది పడ్డారు. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. అలాగే కాస్త విరామ సమయంలో బుడ్డా తమ కుటంబ సభ్యులతో కాసేపు సరదాగా మాట్లాడుతూ ఆనందంగా గడిపారు. రాత్రి8 గంటల వరకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూనే ఉన్నారు.

- శ్రీశైల నియోజక వర్గ ఎమ్మెల్యేగా బుడ్డా రాజశేఖరరెడ్డి విజయం సాధించడం పట్ల టీడీపీ నాయకులు కార్యకర్తలు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెలుగోడు పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయం నాగుల కట్ట వద్ద 303 టెంకాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆర్యవైశ్య ప్రముఖులు బుడ్డా గెలుపును పురస్కరించుకుని భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమాలలో అన్నారపు శేషిరెడ్డి, ఖలీల్, అబ్దుల్ కలాం, మండ్ల శంకర్‌రెడ్డి, జనార్దన్, సంజీవరాయుడు, రాము, సుబ్రహ్మణ్యం, రవికుమార్, చంద్ర తదితరులుపాల్గొన్నారు.

పాణ్యం: పాణ్యంలోని బస్టాండు సమీపంలో జిల్లా టీడీపీ కార్యదర్శి రమణమూర్తి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఉదయం కర్నూలుకు పెద్ద ఎత్తున తరలివెళ్లి టీడీపీ అభ్యర్థి గౌరు చరితకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గడివేముల: సార్వత్రిక ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గౌరుచరిత భారీ మెజార్టీతో గెలుపొందడంతో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని ముఖ్య నాయకుల ఇంటి వద్దకు వెళ్లి కేక్‌లను కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. మండల నాయకులు భారీ మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యే అభ్యర్థి గౌరుచరితను, నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నందికొట్కూరు: నందికొట్కూరు నియోజకవర్గంలో విజయం సాధించడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. నందికొట్కూరు పట్టణంలో ప్రతి వార్డులోని టీడీపీ నాయకులు కేక్‌లు కట్ చేసి, మిఠాయిలు తినిపించుకున్నారు. పట్టణంలో 65వ బూత్ ఇన్‌చార్జి లింగమయ్య సంతోషం వ్యక్తం చేశారు. కృష్ణారెడ్డి, మహబూబ్‌బాషా, మల్లికార్జున, రామకృష్ణుడు తదితర టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన గిత్తా జయసూర్య, అందుకు పూర్తి సహాయ సహకారాలు అందించిన మాండ్ర శివానందరెడ్డిని బుధవారం అల్లూరు గ్రామంలో అభిమానులు గజమాలతో సత్కరించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి శుభాకాంక్షలు చెప్పారు. అల్లూరు గ్రామంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో పోలీసుల వచ్చి వాహనాలను మళ్లించి సమస్యను పరిష్కరించారు.

జూపాడుబంగ్లా: ఎమ్మెల్యేగా గెలుపొందిన జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాండ్ర ఉమాదేవి దంపతులు తర్తూరు లక్ష్మీరంగనాథస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారికి గ్రామప్రజలు, నాయకులు పూలమాలలతో సత్కరించారు. టీడీపీ నాయకులు రమణారెడ్డి, గిరీశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్, రామోహ్మన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, నారాయణరెడ్డి, దొరబాబురెడ్డి, రవికాంత్, రవికుమార్‌యాదవ్, జంగాలపెద్దన్న, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్, బాబు తదితరులు పాల్గొని పూజలు నిర్వహించి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

మిడుతూరు: చింతలపల్లి, పీరుసాహేబ్‌పేట, చౌట్కూరు, కడుమూరు, నాగలూటి, తిమ్మాపురం తదితర గ్రామాల టీడీపీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున మిడుతూరుకు తరలిచ్చారు. దీంతో టీడీపీ కార్యాలయం ఎదుట మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కాతా రామచంద్రా రెడ్డి, కాతా విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో బుధవారం సాయంత్రం నాయకులు, కార్యకర్తలు స్వీటు పంపిణీ చేశారు. సుందరరాజు మాట్లాడుతూ వైసీపీ రాష్ట్రంలో అరాచకపాలన సాగించడంతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, వైసీపీ నాయకుల అరచాకలను భరించలేక ప్రజలు టీడీపీకి ఓట్లు వేసి అత్యధిక స్థానాలలో గెలిపించారని అన్నారు. సందికొట్కూరు నియోజకవర్గంలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి కృషితో ఎమ్మెల్యేగా గిత్త జయసూర్య విజయం సాధించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజేయుడు, శ్రీనాద్‌రెడ్డి, బక్కన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.



అల్లూరులో జయసూర్య, మాండ్రను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు



లక్ష్మీరంగనాథస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి దంపతులు, నాయకులు



నెహ్రూనగర్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు



ఎమ్మెల్యే ఫరూక్‌ను సన్మానిస్తున్న మార్కెట్ ప్రసాద్



గడివేముల: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి



కరివేనలో టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు



కుటుంబ సభ్యులతో సరదాగా మాట్లాడుతున్న బుడ్డా



వెలుగోడులో కేక్ కట్ చేస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు



నంద్యాలలో..



నందికొట్కూరులో..



మిడుతూరులో ఆనందం వ్యక్తం చేస్తున్న నాయకులు

'పర్యావరణాన్ని కాపాడుకుందాం'

ఆత్మకూరు, జూన్ 5: పర్యావరణాన్ని కాపాడుకుందామని నాగార్జున సాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్ బీఎస్ఎస్ మూర్తి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కుని నారాయణ విద్యా విహార్‌లో ఆత్మకూరు అటవీ శాఖ అధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా, డీఎఫ్‌వో రామకొండారెడ్డి, రేంజ్ అధికారి పట్టాభి, పాఠశాల కరస్పాండెంట్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

వెలుగోడు: అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణతోనే మానవుని మనుగడ సాధ్యపడుతుందని వెలుగోడు రేంజర్ ఎం.ఏ ఖాన్ పేర్కొన్నారు. బుధవారం వెలుగోడులో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అడవుల సంరక్షణపై అవగాహన కల్పిస్తూ, అటవీ చట్టాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం వైద్యాధికారులతో కలిసి మొక్కలు నాటారు. వైద్యాధికారులు ఇక్రమ్‌అలీ, అటవీ శాఖ సిబ్బంది శ్రీనివాసులు, బాషా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మిడుతూరు: పర్యావరణాన్ని సంరక్షించుకోవాలని డాక్టర్ తిరుపతి, డాక్టర్ శారద పిలుపునిచ్చారు. మిడుతూరు ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో మొక్కలు నాటారు. వైద్య సిబ్బంది ముర్తుజావలి, ప్రశాంతి, రామతులశమ్మ, రత్నమ్మ, శ్యామలమ్మ, సత్యనారాయణ, జబీన్, మాదన్న పాల్గొన్నారు.

పాణ్యం: చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని పాణ్యం అటవీ క్షేత్రాధికారి సుబ్బరాయుడు అన్నారు. ఎస్సార్బీసీ కాలనీలో చెట్లు నాటారు. డీఆర్వో చంద్రహాసన్, బేతంచెర్ల సెక్షన్ ఆఫీసర్ అనిల్‌కుమార్, బీటు అధికార్లు, అసిస్టెంటు బీట్ అధికారులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ప్రాణమని నందికొట్కూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిరా ప్రియదర్శిని, జూనియర్ సివిల్ న్యాయాధికారి దివ్య అన్నారు. నందికొట్కూరు కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. నందికొట్కూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటరాముడు, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రహమతుల్లా బేక్, అరుణ్‌కుమార్, ఎస్.ఐ వెంకటరమణ పాల్గొన్నారు.



నందికొట్కూరు కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయాధికారులు



ఆత్మకూరు: మొక్క నాటిన ఎన్ఎస్టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్

బయలు వీరభద్రస్వామికి ఆర్జిత పరోక్ష సేవ



వీరభద్రస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలం, జూన్ 5: శ్రీశైల మహక్షేత్రంలో బుధవారం అమావాస్య ఘడియలను పురస్కరించుకొని సాయంత్రం శ్రీశైలక్షేత్రపాలకుడైన బయలు వీరభద్ర స్వామికి పరోక్ష సేవగా విశేష అభిషేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహాగణపతికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించి వీరభద్రస్వామికి పంచామృతాల తోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మో దకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్ర స్వామికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. స్వామి పరోక్షసేవలో మొత్తం 16 మంది భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ. 1,116 సేవారుసుమును చెల్లించి జరిపించుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు పాల్గొనేందుకు దేవస్థానం ఈ పరోక్షసేవల ద్వారా అవ కాశం కల్పించింది. ప్రతి నెల అమావాస్య రోజులలో బయలువీరభద్రస్వామికి జరిపే పరోక్ష సేవలో భక్తులు పాల్గొనవచ్చని దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు తెలిపారు. దేవస్థానం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.శ్రీశైలదేవస్థానం. ఒఆర్‌జీ ద్వారా ఒక్కో పూజకు రూ. 1,116 సేవా రుసుమును చెల్లించి ఏ సేవలో అయిన పాల్గొనవచ్చు. స్వామి రుద్రాభిషేకం, అమ్మవారి కుంకు మార్చన మినహా మిగతా అన్నీ సేవలను భక్తులు శ్రీశైల టీవీ, యూట్యూబ్ చానెల్ ద్వారా వీక్షించవచ్చునని తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఎంపీ బైరెడ్డి శబరికి అభినందనలు



ఎంపీ శబరికి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న బేతంచెర్ల టీడీపీ నాయకులు

డోన్, జూన్ 5: నంద్యాల ఎంపీగా బైరెడ్డి శబరి గెలవడంతో బుధవారం మర్యాదపూర్వకంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. కర్నూలులోని ఆమె స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎంపీ శబరిలను సుబ్బారెడ్డి కలిసి పూలబొకేలు అందజేసి ఆయన సన్మానిం చారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్ర, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, సుదర్శన్, ఉంగరానిగుండ్ల రాముడు, ఎర్రమల నాయుడు, షేక్షావలి చౌదరి ఎంపీ శబరికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భం గా ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనను ప్రజలు బంగాళాఖాతంలో కలిపేశారన్నారు.

బేతంచెర్ల: నంద్యాల ఎంపీగా బైరెడ్డి శబరి గెలవడంతో బుధవారం బేతంచెర్ల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీని కలిసిన వారి టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, చంద్రశేఖర్, సుధాకర్, పోలూరు రాఘవరావు, తిరుమలేష్ చౌదరి, జావాజి వెంకటేశ్వర్లు, బుక్కాపురం లక్ష్మన్న ఉన్నారు.

అఖిలప్రియకు అభినందన



అఖిలప్రియకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జూన్ 5: ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియ విజయం సాధించడంతో బుధవారం మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ కన్వీనర్ రామ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అఖిలప్రియకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల అభివృద్ధిబాట పడతాయని అన్నారు. సూపర్-6 పథకాలు ప్రజలకు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అహోబిలానికి టీడీపీ నాయకుల పాదయాత్ర



అహోబిల క్షేత్రానికి పాదయాత్ర చేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జూన్ 5: ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియ విజయం సాధించడంతో చాగలమర్రి మండలం తోడెండ్లపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బుధవారం మొక్కులు తీర్చడానికి అహోబిల క్షేత్రానికి పాదయాత్ర చేపట్టారు. లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాసరెడ్డి, ఉసేన్‌రెడ్డి, సంజీవరెడ్డి ఉన్నారు.

ఆళ్లగడ్డలో.. ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియ విజయం సాధించడంతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం మొక్కులు తీర్చుకున్నారు. ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామ మాజీ సర్పంచ్ ఎన్.రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని మసీదులో 101 టెంకాయుల కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. అలాగే పట్టణంలోని కాళికామాత ఆలయంలో విశ్వబ్రాహ్మణులు, ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు మిఠాయిలు పంచి పెట్టారు.

మారిన సీన్..

టీడీపీ కార్యాలయం వద్ద ప్రత్యక్షమైన పోలీసులు



డోన్, జూన్ 5: డోన్‌లో టీడీపీ ఎమ్మెల్యేగా కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి గెలవడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. బుధవారం టీడీపీ కార్యాలయం వద్ద పోలీసులు ప్రత్యక్షమయ్యారు. టీడీపీ కూటమి ఘన విజయం సాధించడంతో పోలీసు అధికారుల్లో అనూహ్య మార్పు కనిపించింది. ఎన్నికల ఫలితాల ముందు వరకు పోలీసు అధికారులు వైసీపీకి ఏకపక్షంగా పని చేశారు. ఎన్నికల పోలింగ్ తర్వాత కూడా మొన్నటి వరకు మంత్రిగా ఉన్న బుగ్గన ఆదేశాలకు అనుగుణంగా పోలీసు అధికారులు పని చేస్తూ వచ్చారు. పలువురు టీడీపీ నాయకులపై కూడా అక్రమ కేసులు నమోదు చేశారు. అయితే మంగళవారం ఓట్ల లెక్కింపు ఫలితాల్లో రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం భారీ విజయం సాధించింది. డోన్‌లో మంత్రి బుగ్గన ఓడిపోయారు. టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అంతక ముందు టీడీపీ కార్యాలయం వైపు కన్నెత్తి కూడా చూడని పోలీసు అధికారుల్లో మార్పు వచ్చేసింది. బుధవారం ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది టీడీపీ కార్యాలయం వద్ద ప్రత్యక్షమయ్యారు.

అరాచక పాలన అంతమైంది

డోన్(రూరల్), జూన్ 5: రాష్ట్రంలో అరాచక పాలన అంత మైందని డోన్ నియోజకవర్గ జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం డోన్ మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకులు శేషఫణిగౌడుతో కలిసి ఆయన మాట్లాడుతూ డోన్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎమ్మెల్యేగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఘన విజయం సాధించడంతో టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన సంబరాల్లో జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలా మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఓటు అనే ఆయుధంతో ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు.

ఇది బీసీల విజయం

డోన్(రూరల్), జూన్ 5: రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం హర్షణీయమని, ఇది బీసీల విజయంగా భావిస్తామని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, టీడీపీ నాయకుడు సీలం భాస్కర్ నాయుడు అన్నారు. బుధవారం డోన్ టీడీపీ కార్యాలయం ప్రాంగణంలో ఆయన మాట్లాడారు. టీడీపీకి బీసీలు వెనుదన్నుగా ఉన్నారనీ, ఎన్నికల ఫలితాల్లో మరోసారి స్పష్టమైందన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధికి అఖిలప్రియ కృషి'

రుద్రవరం, జూన్ 5: ఆళ్లగడ్డ అభివృద్ధికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కృషి చేస్తారని యాదవ సంఘం నాయకులు బండారు బాలరాజు అన్నారు. టీడీపీ గెలుపుపై ఆనందం వ్యక్తం చేశారు. ఆళ్లగడ్డకు వెళ్లి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, మదార్‌బాషా, నాగభూషణ్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, రామయ్య తదితరులు ఉన్నారు.

దంపతులకు తీవ్ర గాయాలు

రుద్రవరం, జూన్ 5: మండలంలోని తిప్పారెడ్డిపల్లె, నాగులవరం గ్రామాల మధ్య బుధవారం ఆటో, మోటరుసైకిల్ ఢీకొన్న ఘటనలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. టి.లింగందిన్నె గ్రామానికి చెందిన హరిక్రిష్ణ, సరిత అనే దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈ విజయం ప్రజలకే అంకితం: ఎమ్మెల్యే బీసీ

బనగానపల్లె, జూన్ 5: తమ విజయం ప్రజలకే అంకితమని బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే గెలిపిన తర్వాత బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ, ఆయన సోదరులు బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథ్‌రెడ్డి, కుమారుడు మనోహన్‌రెడ్డి, బీసీ మౌర్యనాథ్ రెడ్డి, కుమార్తె బీసీ మనోరమ, ఇతర కుటుంబ సభ్యులు సోదరుడు బీసీ బాల తిమ్మారెడ్డి, తల్లిదండ్రులు బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల స్ఫూర్తి, ప్రజల కోరిక మేరకు ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. తన అన్న బీసీ బాలతిమ్మారెడ్డి లేని లోటు తీరనిదన్నారు. బనగానపల్లెలో సంక్షేమాన్ని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ కుటుంబంపై ఉన్న అపారమైన నమ్మకంతో ప్రజలు ఘన విజయాన్ని అందించారన్నారు. ఈ విజయం ఎప్పటికీ మరువలేనిదన్నారు. తమ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండిన అన్న బాల తిమ్మారెడ్డి తమ మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. 2014 , 2019 ఎన్నికల్లో బీసీ బాలతిమ్మారెడ్డి అందించిన సహాయ సహకారాలు మరువలేనివన్నారు. బనగానపల్లె నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టించడమే తన ముందున్న లక్ష్యమని, నిరంతరం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి ఉన్నతికి తన సహాయ, సహకారాలు అందిస్తానని బీసీ పేర్కొన్నారు.





తల్లిదండ్రులకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బీసీ కుటుంబ సభ్యులు, బీసీ ఇందిరమ్మను అభినందిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు





మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని సత్కరిస్తున్న అభిమానులు, బనగానపల్లె టీడీపీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తల సందడి

బీసీకి అభినందనల వెల్లువ : బనగానపల్లె ఎమ్మెల్యేగా గెలుపొందిన బీసీ జనార్ధన్‌రెడ్డికి బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యక ర్తలు అభినందనలు తెలిపేందుకు భారీగా తరలివచ్చారు. ఎన్నికల్లో విజయం సాధించినందుకు గజమాలలతో బీసీని సత్కరిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమ అభిమాన నాయకుడితో కేక్‌లు కట్ చేయించి సంబరాలు చేసుకున్నారు. బనగానపల్లె, అవుకు, కొలి మిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన నాయ కులు, కార్యకర్తలు వివిధ వాహనాల్లో తరలివచ్చి బనగానపల్లె టీడీపీ కార్యాలయం చేరుకుని ఎమ్మెల్యే బీసీకి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా బీసీ మాట్లాడుతూ తన విజయానికి కారకులైన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బీసీ ఇంది రమ్మ, పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథ్ రెడ్డి లను కలిసి పూలమాలలు, బొకెలతో వారిని సత్కరించారు.

వైసీపీ కంచుకోటకు బీటలు

» ఎర్రబోతుల కుటుంబానికి మొదటిసారి ఎదురు దెబ్బ
» కొలిమిగుండ్ల మండలంలో టీడీపీ విజయ దుందుభి

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 5: వైసీపీకి కంచుకోటకు బీటలు వారాయి. ఎంతో కాలంగా ఆ పార్టీకి అండగా నిలిచిన కొలిమిగుండ్ల మండలంలో తెలుగుదేశం పార్టీ విజయదుందుభి మోగించింది. గత రెండు పర్యాయాలు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి మెజార్టీ కట్టబెట్టిన మండల ప్రజలు ఈసారి టీడీపీకి అండగా నిలిచారు. మండలంలో మొత్తం 37947ఓట్లు పోల్ కాగా, టీడీపీ 19,308 ఓట్లు రాగా, 16,870 ఓట్లు వైసీపీకి దక్కాయి. దీంతో టీడీపీకి 2438 ఓట్లు మెజారిటీ లభించింది. దీంతో టీడీపీ శ్రేణుల్లో పెద్ద ఎత్తున సంబరాలు నెలకొన్నాయి. గత 30ఏళ్లుగా స్థానిక సంస్థలు, సార్వత్రిక ఎన్నికల్లో ఎర్రబోతుల కుటుంబానికి కొలిమిగుండ్ల మండల ఓటర్లు అండగా నిలిచారు. అయితే 30ఏళ్ల తర్వాత మొదటిసారి బీసీ జనార్ధనరెడ్డి నేతృత్వంలో చరిత్రను తిరగరాశారు. ఎర్రబోతుల మరణం తర్వాత జరిగిన మొదటి సారి జరిగిన ఈ ఎన్నికల్లో ఆ కుటుంబానికి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. మండలంలో టీడీపీ మెజార్టీ రావడంతో పాటు, జడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సొంత పంచాయతీ పేట్నీకోటలో టీడీపీకి మెజార్టీ రావడం వైసీపీ కంచుకోటను బద్దలు కొట్టినట్లయ్యింది. కొలిమిగుండ్లలో టీడీపీకి 630 ఓట్లు మెజార్టీ లభించింది. చింతలాయపల్లె, నాయినిపల్లె, హ నుమంతుగుండం మినహా ఏ గ్రామంలోనూ వైసీపీకి పెద్దగా మెజార్టీ రాకపోవడం గమనార్హం. టీడీపీకి మాత్రం కొలిమిగుండ్లతోపాటు, బెలుం, కనకాద్రిపల్లె, గొర్విమానుపల్లె, నాగిశెట్టిపల్లె, తుమ్మలపెంట, కమ్మవారిపల్లె, మధనంతపురం, ఇటిక్యాల, బందార్లపల్లె, తిమ్మనా యినిపేట ఇలా అన్ని గ్రామాల్లో మెజార్టీ లభించింది.

'మలేరియాతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జూన్ 5: గ్రామాల్లో ప్రజలు మలేరియా వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా సహాయ అధికారి వరప్రసాద్, సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి సూచించారు. మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెంలో బుధవారం మలేరియా మాసోత్సవం సందర్భంగా వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు కలిసి ర్యాలీ నిర్వహించారు. 50 శాతం డీడీటీ మొదటి విడత నిర్వహించామన్నారు. మలేరియా వ్యాధి గురించి చెంచులకు అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. 119 గృహాలకు డీడీటీ పిచికారీ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివమోహన్, ఆరోగ్య మిత్ర అధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ బాలస్వామి, ఎంఎల్‌హెచ్‌పీ, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా

» డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి
» శుభాకాంక్షలు తెలిపేందుకు తరలి వచ్చిన వేలాది మంది

డోన్, జూన్ 5: డోన్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని కోట్ల ఉద్ఘాటించారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విజయోత్సవాలు నిర్వహించారు. ఉదయం నుంచే పార్టీ కార్యాలయానికి కార్యకర్తలతో పాటు జనం భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచిన కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని పుష్పగుచ్ఛాలతో ముంచెత్తి అభినందనలు తెలిపారు. వేల మంది తరలిరావడంతో పార్టీ కార్యాలయం ఆవరణమంతా కిక్కిరిసిపోయింది. పార్టీ నాయకులు కేక్‌ను కట్ చేసి కోట్లను సన్మానించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ దోపిడీ, అరాచక పాలనను పాతాళానికి తొక్కేస్తూ ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. డోన్ నియోజకవర్గంలో ప్రజలకు జవాబుదారీగా పని చేస్తానన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు మళ్లీ కావాలని ఎన్డీయే కూటమికి ప్రజలు పట్టం కట్టారన్నారు. అదేవిధంగా పట్టణంలోని కోట్ల నివాసం వద్ద కూడా కోలాహలం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను భారీగా తరలివచ్చిన కార్యకర్తలు తరలివచ్చి అభినందనలతో ముంచెత్తారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, భాస్కర్ నాయుడు, రేగటి రామ్మోహన్ రెడ్డి, రంజిత్ కిరణ్, ఆలేబాదు పరమేష్, గోసానిపల్లి మల్లయ్య, వలసల బాలుడు, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, హేమసుందర్ రెడ్డి, జనసేన నాయకులు ఆలామోహన్ రెడ్డి, పరదేశి మహేష్ పాల్గొన్నారు.



కోట్లను పూలమాలలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

● **కోట్లకు అభినందనలు తెలిపిన ఉపాధ్యాయులు:** డోన్ ఎమ్మెల్యేగా గెలిచిన కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని బుధవారం ఉపాధ్యాయసంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్లను డీటీఎఫ్, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో పాటు పలువురు ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అదే విధంగా వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్యే కోట్లను కలిసి అభినందనలు తెలిపారు.

బేతంచెర్ల: ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ శాసనసభ్యులుగా ఎంపికైన కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని బుధవారం గోరుమానుకొండ టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. కోట్లను కలిసి శాలువలు, పూలమాలతో సన్మానించారు. గాజుల చిన్న మద్దిలేటి, బీసీ నాయకులు లోకేశ్‌గౌడు, ఆంజనేయులు, తెలుగు శేఖర్, మధు పాల్గొన్నారు.





కొట్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న గోరుమానకొండ టీడీపీ నాయకులు, కొట్ల సుజాతమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కూటమి శ్రేణుల సంబరాలు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 5: రాష్ట్రంలో టీడీపీ కూటమి ఘన విజయం సాధించడంతో టీడీపీ, జనసేన శ్రేణుల్లో ఆనందాలు వెల్లివిరిస్తున్నాయి. కొలిమిగుండ్లలో ఉలువల నరసింహుడు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు పోరెడ్డి చిన్నపురెడ్డి, గూడురు నాగేశ్వరరెడ్డి, బిజ్జం బాస్కరరెడ్డి బొట్టు స్వామి, గూలి నాగేశ్వరరెడ్డి, గూడురు శివరామిరెడ్డి, రాము, చిట్టి తదితరులు కేకు కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. మరొవైపు పేట్నీకోటలో గొంగటి చంద్రశేఖరరెడ్డి, కొప్పుల శివరామిరెడ్డి, కదిరి శేఖరరెడ్డి, రవీంద్ర, అంబటి గుర్విరెడ్డి, రామాంజనేయరెడ్డి సంబరాలు నిర్వహించారు. జనసేన నాయకుడు పెద్దయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

● బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపుతో మండలంలోని బందార్లపల్లె గ్రామ సమీపంలో వెలసిన నేలబిళం మల్లేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు 216 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. బుధవారం బందార్లపల్లె టీడీపీ నేత కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నేత ఐవీ పక్కీరెడ్డిని ఆహ్వానించి, మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, రాజా, సంజీవరాయుడు, హర్షవర్ధన్‌రెడ్డి, చాకలి శివ, రాఘవ, గంగిరెడ్డి పాల్గొన్నారు.

డోన్(రూరల్): రాష్ట్రంలో జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లో ఘన విజయం సాధించడంతో డోన్‌లో జనసేన పార్టీ నాయ కులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. డోన్ పాతబస్టాండు సర్కిల్‌లో జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అనంరం బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు.



ఉయ్యాలవాడలో..

ప్యాపిలి: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో మండలంలోని బోయవాండ్లపల్లిలో బుధవారం పార్టీ శ్రేణులు చంద్ర బాబు, లోకేశ్ ఫ్లెక్సీలకు పూజలు నిర్వహించారు. అనంతరం రెండు మేకపోతులను బలిచ్చారు. అలాగే నల్లబల్లి గ్రామంలో సుంకులాదేవి ఆలయంలో టీడీపీ నాయకులు అమ్మవారికి 101 కొబ్బరి కాయలు కొట్టారు. కలచట్ల, ప్యాపిలి, అలేబాదులో పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా పేల్చి సంబ రాలు జరుపుకున్నారు.

ఉయ్యాలవాడ: రాష్ట్ర వ్యాప్తంగా కూటమి అభ్యర్థుల గెలుపుపై మండల బలిజసంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో పవన్‌కళ్యాణ్ ఫొటోకు పూలమాల వేసి క్షీరాభిషేకం చేశారు. అఖిలప్రియ గెలుపుపట్ల హర్షం వ్యక్తం చేసి స్వీట్లు పంచి పెట్టారు. బలిజ సంఘం మండల అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: బేతంచెర్ల పట్టణంలోని బైటిపేటలో వెలసిన మౌలాలిస్వామి దర్గాలో బుధవారం డోన్ టీడీపీ యువ నాయకురాలు కోట్ల చిత్రమ్మ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డోన్ టీడీపీ కూటమి అభ్యర్థిగా మా నాన్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించిన ప్రజలందరికీ తాము అండగా ఉంటామన్నారు. బుగ్గన ప్రసన్నలక్ష్మి, మాధవిరెడ్డి, భీమేశ్వరరెడ్డి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, జాకీరుల్లా బేగ్, బుగ్గన బ్రహ్మానందరెడ్డి బజాజ్ రామిరెడ్డి, సయ్యద్, అంజాద్, బాషా పాల్గొన్నారు.

● కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో మండల టీడీపీ నాయకులు భీమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని సత్రం నుంచి పాతబస్టాండు వరకు విజయోత్సవ ర్యాలీ బుధవారం రాత్రి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు.

చాగలమర్రి: వైసీపీ అరాచక పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పి టీడీపీకి పట్టం కట్టారని టీడీపీ నాయకులు ఓబయ్య, పుల్లయ్య, ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా గెలుపొందిన భూమా అఖిలప్రియకు బుధవారం శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. నాయకులు నాగేశ్వరరావు, నరసింహులు, ఖాజా రసూల్ తదితరులు పాల్గొన్నారు.



కొలిమిగుండ్లలో విక్టరీ చూపుతున్న టీడీపీ నాయకులు



డోన్‌లో సంబరాలు చేసుకుంటున్న జనసేన నాయకులు



బేతంచెర్లలో మౌలాలి స్వామి దర్గాలో పూజలు చేస్తున్న కోట్ల చిత్రమ్మ

చికిత్సపొందుతూ
యువకుడి మృతి

శిరివెళ్ల, జూన్ 5: ఆత్మహత్యాయత్నం చేసిన రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి చెందిన గోస వెంకటదొర(23) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ బుధవారం తెలిపారు. వివరాలివీ.. ఆలమూరుకు చెందిన వెంకటదొర నంద్యాల పట్టణంలోని దేవనగర్‌కు చెందిన ప్రియాంక అనే యువతితో ఇటీవలే ప్రేమ వివాహం చేసుకున్నాడు. వివాహం అనంతరం ప్రియాంక తల్లిదండ్రులు ఆమెను నంద్యాలలోని ఇంటికి తీసుకెళ్లారు. నెల రోజులు గడుస్తున్నా తన భార్య ప్రియాంకను తిరిగి తనవద్దకు పంపించకపోవడంతో వెంకటదొర మనస్తాపానికి గురై శిరివెళ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో గత నెల 28న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో చికిత్స నిమిత్తం నంద్యాలకు, అక్కడి నుంచి కర్నూలుకు తీసుకెళ్లగా చికిత్సపొందుతూ కోలుకోలేక ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. యువకుడి తండ్రి నడిపి రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ వెల్లడించారు.

బనగానపల్లె మండలంలో టీడీపీదే హవా

బనగానపల్లె, జూన్ 5: బనగానపల్లె మండలంలో అసెంబ్లీ ఎన్ని కల్లో టీడీపీకే జై కొట్టారు. బనగానపల్లె మండల పట్టణ ప్రజలు బీసీ జనార్దన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు పలికారు. బనగానపల్లె పట్టణంలో టీడీపీకి మొత్తం 31 బూత్‌లలో టీడీపీకి మెజార్టీ లభించింది. పట్టణం లో మొత్తం 30,086 ఓట్లు ఉండగా పట్టణంలో పోలైన ఓట్లు 21,660 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో టీడీపీకి 13843 ఓట్లు రాగా, వైసీ పీకి 7,817 ఓట్లు వచ్చాయి. దీంతో బనగానపల్లె పట్టణంలో టీడీపీకి 6,026 ఓట్ల భారీ మెజార్టీ లభించింది. మండలంలో కూడా టీడీపీకి భారీ మెజార్టీ వచ్చింది. పసుపలలో టీడీపీకి 342 ఓట్లు మెజార్టీ రాగా పెద్దరాజుపాలెంలో టీడీపీకి 162 ఓట్లు మెజార్టీ రాగా, క్రిష్ణగిరిలో వైసీపీకి 3 ఓట్లు మెజార్టీ రాగా చెర్లోకొత్తూరులో 24 ఓట్లు మెజార్టీ, గులాం అలియాబాద్‌లో టీడీపీకి 109 ఓట్లు, కటికవాని కుంటలో టీడీపీకి 134 ఓట్లు, యర్రగుడిలో టీడీపీకి 166 ఓట్లు, యనకండ్లలో టీడీపీకి 1193ఓట్లు, బత్తులూరుపాడులో టీడీపీకి 86 ఓట్లు, మీరాపురంలో టీడీపీకి 487 ఓట్లు, హుసేనాపురంలో టీడీపీకి 200 ఓట్లు టీడీపీకి యాగంటిపల్లెలో టీడీపీకి 362 ఓట్లు, పాతపాడులో టీడీపీకి 272 ఓట్లు, సాధుకొట్టంలో టీడీపీకి 149 ఓట్లు, జోలాపురంలో టీడీపీకి 27 ఓట్లు, రాళ్లకొత్తూరులో టీడీపీకి 104ఓట్లు, నిలువగండ్లలో వైసీపీకి 56 ఓట్లు, జమ్ములదిన్నెలో వైసీపికి 120 ఓట్లు, తమ్మడపల్లెలో టీడీపీకి 89 ఓట్లు, మిట్టపల్లెలో వైసీపీకి 38 ఓట్లు, కైపలో టీడీపీకి 238 ఓట్లు, నంకలాపురంలో టీడీపీకి 48 ఓట్లు, పండ్లాపురంలో టీడీపీకి 69, వెంకటాపురంలో టీడీపీకి 362 ఓట్లు, పలుకూరులో టీడీపీకి 497 ఓ ట్లు, గోవిందిన్నెలో టీడీపీకి 83 ఓట్లు, రామకృష్ణాపురంలో టీడీపీకి 415 ఓట్లు, రామతీర్థంలో టీడీపీకి 192 ఓట్లు, బీరవోలులో టీడీపీకి 126 ఓట్లు, చెర్వుపల్లెలో టీడీపీకి 154 ఓట్లు, నందివర్గంలో టీడీపీకి 191 ఓట్లు, తిమ్మాపురంలో వైసీపికి 45 ఓట్లు, జిల్లెళ్లలో వైసీపికి 89 ఓట్లు, నందవరంలో 491 ఓట్లు, విఠలాపురంలో టీడీపికి 87 ఓట్లు, అప్పలా పురంలో టీడీపీకి 104 ఓట్లు, కాపులపల్లెలో టీడీపీకి 90 ఓట్లు, ఇల్లూ రుకొత్తపేటలో టీడీపీకి 767 ఓట్లు, గులాంనబీపేటలో వైసీపీకి 2 ఓట్లు, టంగుటూరులో టీడీపీకి 338 ఓట్లు లభించాయి.